క్లుప్తంగా

భారీ ధర పలికిన లడ్డూ వేలం



లడ్డూను దక్కించుకున్న సురేష్

చీరాల రూరల్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని గొడవర్తివారి వీధిలో కోదండరామ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గణనాథుడి చేతిలో నిర్వాహకులు పెద్ద లడ్డూను వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో దోగుపర్తి వెంకట సురేష్ రూ. 40 వేలు దక్కించుకున్నాడు. అనంతరం సురేష్ లడ్డును చిన్నచిన్న ప్యాకెట్లలో ప్రసాదంలా భక్తులకు పంచిపెట్టాడు. దీంతో భక్తులు సురేష్‌ను అభినందించారు.

ఆవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ



పెన్షన్లు అందిస్తున్న ఆవోపా ప్రతినిధులు

చీరాల అర్బన్: పట్టణంలోని ఆవోపా కార్యాలయంలో ఆదివారం దివ్యాంగులకు, వృద్ధులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంజీసీ మార్కెట్ అధ్యక్షుడు వేముల చంద్రశేఖర్, పోలిశెట్టి ప్రేమ్‌కుమార్, మద్దు వెంకట సుబ్బారావు, గెల్లి సుకన్యలు హాజరై మాట్లాడారు. దాతల సహకారంతో ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆవోపా సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా 200 మందికి పెన్షన్లు, బియ్యం, భోజనం అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ ఎం రాఘవేంద్రరావు, అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, ఏకాంబరేశ్వరబాబు, కోశాధికారి పేర్ల వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి ఆపన్నహస్తం



కుటుంబానికి కుట్టుమిషన్, సైకిళ్ల అందిస్తున్న సురేంద్ర

చీరాల అర్బన్: ఒక కుటుంబానికి ఉపాధికి అవసరమైన కుట్టుమిషన్, ఇంటర్, డిగ్రీ చదువుతున్న ఇద్దరు కుమారులకు సైకిళ్లను సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర అందించారు. ఆదివారం స్థానిక కొట్లబజారులోని సత్యసాయి మందిరంలో చీరాలలోని ఒక కుటుంబానికి ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్, సైకిళ్లు అందించారు. అలానే వేటపాలెం మండలంలో ఇద్దరికి ఉపాధి నిమిత్తం ఎల్రక్టికల్ పనికి సంబంధించిన కిట్లు, ఒకరికి బేల్దారి పనికి సంబంధించిన మార్బుల్ కటింగ్ మిషన్, ఒక కుటుంబానికి పిండిమర మిషన్ అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాంబాబు, జిల్లా మహిళా కో–ఆర్డినేటర్ జానకి, కన్వీనర్లు రవి, నరసింహారావు, సభ్యులు గుప్తా, రామపున్నారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఎం తీర్మానం



మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలపై పోరాడాలని సీపీఎం గ్రామ శాఖ ఆదివారం పలు తీర్మానాలను అమోదించింది. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సభలో పార్టీ గ్రామ కార్యదర్శిగా వై. రాంబాబు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో డ్రైనేజీ, రోడ్లు, పంచాయతీ కుళాయి ద్వారా ప్రతి రోజు సాగర్ నీరు, జగనన్న కాలనీలో విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, 16వ నంబర్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డును బాగు చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ నాయకుడు సీహెచ్ మంజుందార్, బత్తుల హనుమంతరావు, సూరిబాబు, వై రాంబాబు, మొగిలి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

దశపర్ణి కషాయంతో మేలు

చినగంజాం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, రైతుకు లాభాన్ని చేకూర్చే దశపర్ణి కషాయాన్ని వాడితే రైతుకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కలిగిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం చినగంజాం ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ బీ జయలక్ష్మి, ఐసీఆర్‌పీలు టీ రజిని, బీ జ్ఞానానందం, జీ పద్మలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.



చీరాల: నగరోత్సవంలో శయన గణపతి



చీరాల: వివిధ ఆకృతుల్లో కొలువై ఉన్న గణనాథులు



చీరాల: డ్రై ఫ్రూట్స్‌తో ఏర్పాటు చేసిన గణనాథుడు



నిమజ్జనానికి సిద్ధం చేస్తున్న కూకట్లపల్లి గణనాథుడు

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్యా

- జోరుగా గణేషుడి నిమజ్జనోత్సవాలు
- వాడరేవు తీరానికి తిరునాళ్ల కళ
- డీజే పాటలు, తీన్‌మార్ డ్యాన్స్‌లతో యువత సందడి



ఈపురుపాలెంలో గణనాథుడి ఊరేగింపు సందర్భంగా సందడి చేస్తున్న యువత



మార్టూరులో ఊరేగింపు నిర్వహిస్తున్న మద్ది సీతాదేవి కాలనీ గణనాథుడు



అద్దంకిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహం



వాడరేవు తీరంలో గణపయ్యను నిమజ్జనం చేస్తున్న భక్తులు

చీరాల/చీరాల టౌన్/వేటపాలెం/చీరాల రూరల్: గణేషుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలందుకుంటున్న వినాయకుడు నిమజ్జనాలకు తరలుతున్నాడు. గత తొమ్మిది రోజులుగా విశేష పూజలు, ఇష్టమైన ఫలహారాలు స్వీకరించిన గణపతికి భక్తులు వీడ్కోలు పలుకుతున్నారు. గణపయ్యా.. వెళ్లి రావయ్యా. అంటూ బైబై చెప్తున్నారు. చలువ పందిళ్లల్లో పూజలందుకున్న గణనాథుడిని గంగ ఒడికి చేరుస్తున్నారు. గణనాథులు నిమజ్జనాలకు ఆదివారం వాడరేవుకు జోరుగా తరలివచ్చాయి. వాడరేవులో జోరుగా నిమజ్జనాలు జరగడంతో తీరానికి తిరునాళ్ల కళ వచ్చింది. తీరానికి విగ్రహాలు, భక్తులు అధిక సంఖ్యలో చేరడంతో కిక్కిరిసింది వాడరేవు. వాడరేవుకు ఆదివారమే 55 విగ్రహాలు నిమజ్జనానికి తీసుకువచ్చారు. ఈనేపథ్యంలో చీరాల సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు.

✦ వేటపాలెం మండల పరిధిలోని పొట్టి సుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం, రామాపురం సముద్ర తీరాలకు వినాయకులు నిమజ్జనానికి తరలి వచ్చారు. యువకులు, మహిళలు, భక్తులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై.. అంటూ నినాదాలు చేశారు. వేటపాలెం చుట్టు పక్కల గ్రామాలైన సంతరావూరు, ఇంకొల్లు ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను ట్రాక్టర్లపై వేటపాలెం ప్రాంతాల్లో సముద్రతీరాలకు నిమజ్జనానికి తీసుకొచ్చారు.

అకట్టుకున్న చిన్నారుల భరతనాట్యం

చినగంజాం/మార్టూరు/యద్దనపూడి/కారంచేడు: గణేష్ నిమజ్జనం సందర్భంగా మండపాల వద్ద చిన్నారులు, యువత సందడి చేశారు. పర్చూరు అద్దంకమ్మ మాన్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం భక్తులను అమితంగా ఆకట్టుకుంది. శనివారం రాత్రి ఊరేగింపు సందర్భంగా విగ్రహం వద్ద శాతావాహన హైస్కూల్ ఆధ్వర్యంలో చిన్నారులు భరత నాట్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్వామి వారి లడ్డు వేలంపాట నిర్వహించగా కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన పోట్రు శ్రీనాథ్ చౌదరి లడ్డూను రూ.22,500 దక్కించుకున్నారు. కార్యక్రమంలో కొమ్మాలపాటి రవి, కారంపూడి నందిని తేజ, సిగనం భాస్కర్, తులసీ శ్రీనివాసరావు, తోట మణి, తులసి రాజా తదితరులు పాల్గొన్నారు.

✦ మార్టూరు మండలంలోని ద్రోణాల గ్రామాల్లో శనివారం రాత్రి గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మార్టూరులోని మద్ది సీతాదేవి కాలనీలో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహాన్ని కాలనీవాసులు ఆదివారం గ్రామంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించి బొల్లాపల్లి సాగర్ కాలువలో నిమజ్జనం నిర్వహించారు.

✦ కారంచేడు మండలంలోని దగ్గుబాడు, ఆదిపూడి, తిమిడెదపాడు, యర్రంవారిపాలెం, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, కుంకలమర్రు, స్వర్ణ, కారంచేడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించినట్లు భక్తులు పేర్కొన్నారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున్న అన్నదానం ఏర్పాటు చేశారు.

అద్దంకి రూరల్: అద్దంకిలోని విగ్రహాలను గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేశారు. గ్రామాల్లోని విగ్రహాలను అయా గ్రామాల చెరువులు, కాలువలో నిమజ్జనం చేశారు. అడిషనల్ డీఎస్పీ విఠలేశ్వర రావు ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని ధర్మవరం గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపులో వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు మధ్య జరిగిన వివాదంపై సీఐను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలవకూరు గ్రామంలో జరుగుతున్న నిమజ్జన కార్యాక్రమాన్ని పరిశీలించారు.

ఆకట్టుకున్న గణనాథుని నగరోత్సవం

చీరాల అర్బన్: చీరాల వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల ఉత్సవాల అనంతరం గణాధులను కడలి చెంతకు చేరారు. పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు చీరాల, కారంచేడు, పర్చూరు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణనాథులు నిమజ్జనానికి వాడరేవు సముద్ర తీరానికి చేరుకున్నాయి. పట్టణంలోని ఎంజీసీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన శయన గణపతితో పాటు పలు ఆకృతుల్లో ఏర్పాటు చేసిన గణానాథులను ఆదివారం రాత్రి నగరోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాధులను ఊరేగింపు నిర్వహించారు. అలానే డ్రైఫ్రూట్స్‌తో ఏర్పాటు చేసిన గణపతి అందరిని ఆకట్టుకుంది.

బల్లికురవ: తొమ్మిది రోజుల పాటు పగలు రాత్రి భజనలతో హోరెత్తిన కూకట్లపల్లి గ్రామంలోని గణనాథుడు ఆదివారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన గణనాథుడిని మేళ తాళాలు, డప్పువాయిద్యాలు, పాటకచ్చేరిల మధ్య ఇక సెలవుంటూ అద్దంకి బ్రాంచ్ కాలువ కొమ్మాలపాడు వద్ద నిమజ్జనానికి తరలించారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ ఇప్పల అయ్యప్పరెడ్డి, మండల అధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి తదితరలు పాల్గొన్నారు.



వేటపాలెం వీధుల గుండా సముద్రానికి తరలుతున్న గణపతి



వాడరేవులో గణేషుడుని నిమజ్జనానికి తీసుకొస్తున్న భక్తులు



అద్దంకిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



కారంచేడు యజ్ఞశాలపేటలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



భరతనాట్య ప్రదర్శన చేసిన చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



భక్తులతో కిక్కిరిసిన వాడరేవు తీరం

మహమ్మద్ ప్రవక్త మార్గంలో నడవాలి



మసీదులో సమావేశమైన ముస్లింలు

పర్చూరు (చినగంజాం): మహమ్మద్ ప్రవక్త సూచించిన పవిత్ర మార్గంలో అందరూ నడవాలని.. అదే స్వర్గానికి తొలిమెట్టు ముఫ్తీ మహమ్మద్ హబీబుల్లా సూచించారు. మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా జరుపుకునే మిలాదున్ నబీ పండుగను పురస్కరిచుకొని ఆదివారం స్థానిక అతహర్ మసీదులో ముస్లింల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్, బక్రీద్ పండుగల్లాగా మిలాదున్ నబీ పండుగ కూడా ముస్లింలకు అత్యంత పవిత్రమైనదని తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధనలను ఆదరిస్తూ అందరూ ఇతరులకు సహాయ పడాలని పిలుపునిచ్చారు. అనంతరం అందరికీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ముఫ్తీ రైజ్ సాహెబ్, మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ అహ్మద్ బాషా, పేష్ ఇమాం సాహెబ్, ముతవల్లి షేక్ అబ్దుల్ నబి, మత పెద్దలు పాల్గొన్నారు.

నేడు పోలీసు స్టేషన్ వద్ద ధర్నా

అద్దంకి రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల అక్రమ అరెస్టులకు నిరసనగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ధర్నా కార్యక్రమం ఉటుందని ఆపార్టీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. కావున కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ప్రకటనలో వారు కోరారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత

చీరాల: తప్పిపోయిన బాలుడిని తిరిగి సురక్షితంగా తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. ఆదివారం చీరాల విఠల్‌నగర్‌కు చెందిన దల్లి జనార్దన్, లక్ష్మిలకు చెందిన బాలుడు తప్పిపోయాడు. చీరాల పట్టణంలో ఏడుస్తూ ఉన్న బాలుడిని స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాలుడి వద్ద నుంచి వివరాలు సేకరించిన ఎస్‌బీ పోలీసులు బాలుడి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

రెండు కేసులు నమోదు

చీరాల: చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రెండు కేసు నమోదయ్యాయి. ఈపూరుపాలెం రూరల్ పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కావూరివారిపాలెంకు చెందిన రవీంద్రారెడ్డి భార్య అమ్మమ్మపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అలానే పిట్టువారిపాలేనికి చెందిన వ్యక్తి అదే గ్రామంలోని ఓ ఇంట్లో రాత్రి సమయంలో చొరబడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చల్లగా చూడమ్మా గంగమ్మ..



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మ, పోలేరమ్మ తల్లులకు గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవార్లకు తలంట్లు చేసి ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. పంటల సాగు సమయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయడం వలన సకాలంలో అవసరమైన వర్షాలు పడతాయని, పంటలు బాగా పండుతాయని, ఎలాంటి ప్రకృతి వైపరీత్యాల వలన పంటలను నష్టపోకుండా కాపాడుతారని భక్తుల విశ్వాసం. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



ఏఈ దంపతులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం ఇంజినీరింగ్ డేని ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా విద్యుత్ శాఖ ఏఈ బాల కోటేశ్వరరావు నివాసరంలో రోటరీ అధ్యక్షుడు వీరయ్య కేక్ కట్ చేసి ప్రారంభించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఇంజినీర్లు ప్రాజెక్టులు నిర్మించకపోతే మనకు ఆహారం కూడా కొరతే అవుతుందని చెప్పారు. తరువాత ఎల్రక్టికల్ ఏఈ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చుండూరి మురళీసుధాకరరావు, మల్లాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.